క్లుప్తంగా

సర్వే పరిశీలన



సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్, ఎంపీడీవో

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు సమీపంలోని యానాది కాలనీలో జరుగుతున్న సర్వేను గురువారం తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీవో బాలాజీ పరిశీలించారు. వారు మాట్లాడుతూ యానాది కాలనీలో కుటుంబాల వారీగా నెలకొన్న సమస్యలు తెలుసుకుని వాటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్టు తెలిపారు. వారి ఆదేశాల మేరకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్వే చేయడానికి వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీవో శారదాదేవి, ఏపీవో మురుగేష్, వెలుగు సీసీలు బాలునాయక్, పవన్, వీఆర్వో శివ, అంగన్‌వాడీ కార్యకర్త సావిత్రమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో ప్రేమ వివాహం



ప్రేమ జంటతో రొంపిచెర్ల పోలీసులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల పోలీసు స్టేషన్‌లో గురువారం పోలీసులు ప్రేమ జంటకు వివాహం చేశారు. సీఐ సూర్యనారాయణ కథనం మేరకు.. కేవీ.పల్లె మండలం మహల్‌రాజుపల్లెకు చెందిన వంశీ(24), నందిని(19) ప్రేమించుకున్నారు. వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. వారు ఇంటి నుంచి వచ్చేశారు. బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో రొంపిచెర్లలో వెళుతుండగా పోలీసులకు అనుమానం వచ్చి విచారించారు. విచారణలో తాము ప్రేమించుకున్నామని, పెళ్లి చేసుకునేందుకు వెళుతున్నట్టు వారు పేర్కొన్నారు. దీంతో పోలీసులు ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి విచారించారు. ఇద్దరు మేజర్లు కావడంతో పోలీసు స్టేషన్‌లోనే పూల దండలు మార్పించి వివాహం చేశారు. అనంతరం కేవీ పల్లె పోలీసులకు అప్పగించారు. ప్రేమికులకు రక్షణ కల్పించాలని సీఐ సూచించారు.

దర్గాలోని హుండీ చోరీ

పుంగనూరు: పట్టణంలోని నాగపాళెంలో వున్న హజరత్ మహబూబ్‌సుబహాని దర్గాలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. దర్గాలో వున్న హుండీని చోరీ చేశారు. దర్గా కమిటీ సభ్యులు గురువారం ఉదయం చోరీ విషయాన్ని గుర్తించి సీఐ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశారు. సీఐ మాట్లాడుతూ దీనిపై ఆ ప్రాంతంలోని సీసీ పుటేజీని పరిశీలించి దొంగలను పట్టుకుంటామని తెలిపారు. దర్గాలు, ఆలయాలు, ప్రముఖ కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి

పలమనేరు: ఎమ్మార్పీఎస్ బలోపేతానికి కృషి చేస్తామని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు హరిక్రిష్ణ మాదిగ తెలిపారు. గంటావూరులో గురువారం ఎమ్మార్పీఎస్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో నియోజకవర్గ ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులను నియమిస్తామన్నారు. గ్రామ స్థాయి నుంచి సంఘాన్ని బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. నేతలు జగన్నాథం, మల్లికార్జున, కిశోర్, ప్రకాష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీపీగా శరవణకుమార్



చిత్తూరు లీగల్: నగరానికి చెందిన న్యాయవాది ఎస్.శరవణ కుమార్‌ను అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా నియమిస్తూ రాష్ట్ర హోంశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. చిత్తూరులోని 9వ అదనపు జిల్లా కోర్టుకు ఈయన మూడేళ్లపాటు ఏపీపీగా కొనసాగనున్నారు. ఇందుకుగాను నెలకు రూ.40 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చేదెక్కిన చెరుకు

పలమనేరు ప్రాంతంలో భారీగా తగ్గిన చెరుకు తోటలు



- కనిపించని చెరుకు తోటల సాగు
- భారంగా మారిన బెల్లం తయారీ
- చెరుకు రైతు కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం
- చెరుకు రసానికి ఊపందుకున్న డిమాండ్

ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమర మండలాల్లో చెరుకు పంట సాగు తగ్గిపోయింది. చెరుకు సాగు చేసినా గిట్టుబాటు కాకపోవడం, గానుగల ద్వారా బెల్లం తయారీ భారంగా మారడంతో చెరుకు సాగుపై రైతులు ఆశలు వదులుకున్నారు. ఏడాదిపాటు ఎండనక, వాననక కష్టపడి చెరుకు పంటను సాగు చేసిన రైతులకు ధరలు గిట్టుబాటు కావడం లేదు. ఫ్యాక్టరీలకు తరలించినా లేదా బెల్లం తయారు చేసుకున్నా రైతులకు నష్టాలు తప్పడం లేదు. ఒకప్పుడు వేల ఎకరాల్లో సాగులో వున్న చెరుకు పంట ప్రస్తుతం వందల ఎకరాలకు పడిపోయింది.

పలమనేరు: పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో గతంలో 30 వేల ఎకరాల్లో చెరుకు పంట సాగయ్యేది. పుంగనూరు సమీపంలో ఒకటి, ఎస్‌ఆర్ పురం మండలంలో మరొకటి షుగర్ ఫ్యాక్టరీలు వుండేవి. అంతేగాక చిత్తూరులో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ పనిచేసేది. దీంతో ఎక్కువ మంది రైతులు చెరుకును పండించేవారు. గిట్టుబాటు ధరలు కూడా వచ్చేవి. క్రమేణా గిట్టుబాటు ధరలు తగ్గుతూ వచ్చాయి. దీనికితోడు ప్రభుత్వాలు ఫ్యాక్టరీలను మూసేయడంతో రైతులు నష్టాలబారిన పడుతూ వచ్చారు. చెరుకుపైనే ఆశలు పెట్టుకున్న రైతులు అప్పులపాలయ్యే పరిస్థితి ఎందుకని సాగును నిలిపేశారు. దీంతో చెరుకు సాగు భారీగా తగ్గింది. ప్రస్తుతం పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో 300 ఎకరాల్లో మాత్రమే పంట సాగవుతోంది.

భారంగా మారిన బెల్లం తయారీ

చిత్తూరు, పుంగనూరు, ఎస్‌ఆర్‌పురం మండలంలో వున్న చెక్కర ఫ్యాక్టరీలు మూత పడడంతో చెరుకును కొనుగోలు చేసేవారు కరువయ్యారు. రైతులు సొంతంగా బెల్లం తయారు చేసుకుందామనుకున్నా నిర్వహణ భారంగా మారింది. సమయానికి కూలీలు దొరకకపోవడం, విద్యుత్ సమస్యలు, వర్షాలు తదితర కారణాలతో గానుగలు నిర్వహించడానికి వీలు కావడం లేదు. బండి బెల్లం (760 కేజీలు) ధర రూ.30 వేలు పలికినా దాన్ని తయారు చేసేందుకు రూ.20 వేలు ఖర్చు అవుతోంది. దీంతో చెరుకు పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు.

చెరుకు పాలకు పెరుగుతున్న డిమాండ్

పలమనేరు ప్రాంతంలో చెరుకు తోటలసాగు లేకున్నా చెరుకు పాలకు డిమాండ్ పెరుగుతోంది. స్థానిక బెంగళూరు–చెన్నై హైవేలో పదుల సంఖ్యలో చెరుకు రసం దుకాణాలు ఏర్పాటయ్యాయి. గ్లాసు చెరుకు రసం రూ.30 వరకు విక్రయిస్తున్నారు. కట్ట చెరుకుల ధర రూ.300 దాకా పలుకుతోంది.



ఆరోగ్యానికి మేలు చేసే చెరుకు రసం

చెరుకు పాలతో ఎన్నో లాభాలు



చెరుకు పాలు తాగడం వల్ల వేడి నుంచి తక్షణం ఉపశమనం లభిస్తుంది. మనిషికి వెంటనే శక్తినిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బరువు తగ్గడానికి మేలు చేస్తుంది. ముఖ్యంగా కాలేయాన్ని శుభ్రపరుస్తుంది. ఇందులోని క్రోమియం, మెగ్నీషియం, జింక్ ఖనిజాలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ముఖ్యంగా కిడ్నీలోని రాళ్ల సమస్య తగ్గుతుంది.

– డాక్టర్ రజని, పలమనేరు

రోజూ చెరుకు రసం తాగితే మేలు



ఆరోగ్యమే మహా భాగ్యమని పెద్దలు ఎప్పుడో చెప్పారు. మన వద్ద ఎంత డబ్బున్నా ఆరోగ్యానికి మించినది లేదు. మన శరీరానికి మేలు చేసే వాటిల్లో చెరుకు రసం మొదటి స్థానంలో ఉంటుంది. ఇది లివర్‌ను చాలా బాగా క్లీన్ చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. శరీర వేడిని తగ్గిస్తుంది. ప్రజలు కూల్ డ్రింక్స్‌కు బదులు చెరుకు రసం తాగడం మేలు.

– మొగసాల రెడ్డెప్ప, బైరెడ్డిపల్లి

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పుంగనూరుకు మొదటి స్థానం



మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి

పుంగనూరు: చిత్తూరు జిల్లా స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పుంగనూరు మున్సిపాలిటీకి మొదటి స్థానం లభించిందని కమిషనర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో ర్యాంకుల జాబితాను విడుదల చేసినట్లు తెలిపారు. పుంగనూరు మున్సిపాలిటీకి రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి స్థానం లభించిందని తెలిపారు. విజయం సాధించడంలో సహకరించిన పట్టణ ప్రజలు, మున్సిపల్ కార్మికులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

గుడివంక ఆలయంలో కావళ్ల సందడి



గుడివంక ఆలయంలో భక్తులు

గుడుపల్లె: ఆడి మాసం ప్రారంభం కావడంతో గుడివంకలోని శ్రీ వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయంలో కావళ్ల సందడి నెలకొంది. గురువారం భక్తులు పెద్ద ఎత్తున కావళ్లు ఎత్తుకుని ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు. పశ్చిమ వాహినిలో స్నానాలు ఆచరించి కొండపై హరోంహర వేల్ మురుగ అంటూ డప్పు వాయిద్యాలతో కావళ్లను ఎత్తుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వర్షం కురవాలని..

- బోయకొండ గంగమ్మకు 101 బిందెల నీటితో అభిషేకం
- గాజులవారిపల్లెలో మహిళల ప్రత్యేక పూజలు



101 బిందెల నీటితో గంగమ్మ అభిషేకం చేస్తున్న గాజులవారిపల్లె గ్రామస్తులు

చౌడేపల్లె: ఈ ఏడాది సక్రమంగా వర్షాలు కురవడం లేదు. జూలై నెల ముగుస్తున్నా తగినంత వర్షం పడలేదు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోతున్నాయి. తాగడానికి కూడా నీరు దొరకని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో గాజులవారిపల్లె గ్రామస్తులు గురువారం గ్రామదేవత బోయకొండ గంగమ్మకు 101 బిందెల నీటితో అభిషేకం చేశారు. వెంగళపల్లె పంచాయతీ గాజులవారిపల్లెలో సుమారు 70 కుటుంబాల వారు నివాసమున్నారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు నీటి బిందెలు, పూజ సామగ్రితో ఆలయం వద్దకు చేరుకున్నారు. 101 బిందెల నీళ్లలో పసుపు, కుంకుమ కలిపి అభిషేకాలు చేశారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. ఇటీవల ఎన్నడూ లేని విధంగా జంతువులకు సైతం వింత వ్యాధులు వస్తున్నాయని, జంతు సంపదను రక్షించాలని ప్రార్థించారు. పశువులపై ముద్దకూడుచల్లి గంగమ్మకు శాంతి పూజలు చేపట్టారు.

ఘనంగా చాముండేశ్వరిదేవి ఉత్సవాలు



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

పుంగనూరు: పట్టణంలోని తూర్పుమొగసాలలో వెలసిన చాముండేశ్వరిదేవి ఆలయంలో గురువారం అమ్మవారి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జెట్టి కులస్తులు ఆధ్వర్యంలో అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మంగళహారతులు ఇచ్చారు. ఈ నెల 25 వరకు ఉత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఓపెన్ స్కూల్‌పై అవగాహన



మాట్లాడుతున్న ఎంఈవో లీలారాణి

పలమనేరు: ఏపీ విద్యాశాఖ, సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ నిర్వహిస్తున్నామని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో లీలారాణి తెలిపారు. ఆమె గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ విద్యపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలలో చదువుకునేందుకు అవకాశం లేని వయోజనుల కోసం ప్రభుత్వం 1991లో సార్వత్రిక విద్యాపీఠం ద్వారా ఓపెన్ స్కూల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందులో పదో తరగతితోపాటు ఇంటర్‌ను కూడా చదవవచ్చని తెలిపారు. చదువుకు దూరమైన వారు, మధ్యలో ఆపేసిన వారు మళ్లీ చదువును కొనసాగించవచ్చని చెప్పారు. ప్రవేశాలకోసం స్థానిక ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 బాలసుందరం, కోర్సు డైరెక్టర్ షంషీర్, సుబ్రమణ్యం, పలువురు హెచ్‌ఎంలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి



రొంపిచెర్ల సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ సూర్యనారాయణ

రొంపిచెర్ల: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని కల్లూరు సీఐ సూర్యనారాయణ తెలిపారు. ఆయన గురువారం రొంపిచెర్ల సర్కిల్‌లో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మదనపల్లె–తిరుపతి జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. 45 రోజుల్లోనే నలుగురు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉంటే ప్రమాదాలను నియంత్రించవచ్చన్నారు. అంతేగాక పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. అలా ఇస్తే రూ.25 వేల జరిమానాతోపాటు 6 నెలలు జైలు శిక్ష విధిస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి రూ.10 వేల జరిమానా విధిస్తామని వెల్లడించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సుబ్బారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు



పల్లకిపై ఊరేగుతున్న సుబ్రమణ్యస్వామి

వి.కోట: మండలంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కావిడ మాసం ప్రారంభం కావడంతో వి.కోట పట్టణ సమీపంలోని దాసార్లపల్లిలో వున్న సుబ్రమణ్యస్వామిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తిని పుష్పపల్లకిపై కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు స్వామి వారికి కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థిక సాయం



బాధితునికి నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పులిచెర్ల(కల్లూరు): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న కల్లూరు ఇందిరానగర్‌కు చెందిన షేక్ అబ్దుల్లా(40)కు పీలేరుకు చెందిన మానవత సమాజ సేవా సంస్థ ప్రతినిధులు రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక స్థోమత లేని వారిని తమ సంస్థ ద్వారా ఆదుకుంటున్నట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ వి.రామకృష్ణ, కోచైర్మన్ ఆర్.కృష్ణమూర్తి, అధ్యక్షుడు శెట్టి సుబ్రమణ్యం, కార్యదర్శి బీవీ సురేష్, సభ్యులు పోతంశెట్టి రమేష్, వి.అశోక్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధి కృషి



పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం: కుప్పం ప్రాంతంలో యువతను ప్రోత్సహించడంతోపాటు క్రీడల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. ఆయన గురువారం కుప్పంలో ఎన్‌టీఆర్ స్టేడియంలో రూ.22 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌టీఆర్ స్టేడియాన్ని నిర్మించి క్రీడలను ప్రోత్సహించామన్నారు. ఇప్పుడు రూ.22 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇక్కడ క్రికెట్, షటిల్ వంటి క్రీడలే కాకుండా అన్ని రకాల క్రీడలు ఆడుకునేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు, మాజీ జెడ్పీటీసీ రాజ్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వం పాల్గొన్నారు.

రొంపిచెర్లలో భారీ వర్షం



రొంపిచెర్ల మండలంలో వ్యవసాయ పొలాల్లో నిలిచిన నీరు



కుంటల్లో నిలిచిన వర్షపు నీరు

రొంపిచెర్ల: మండలంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. గత 40 రోజులుగా వర్షం కురవలేదు. దీంతో రైతులు వేరుశనగ విత్తనాలు విత్తలేకపోయారు. బుధవారం రాత్రి భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 104.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన శంకర

పుంగనూరు: పట్టణంలోని కొత్తయిండ్లు వద్ద గురువారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. మంగళం కాలనీకి చెందిన వెంకటేష్(50), శంకర (45) ద్విచక్ర వాహనంలో వెళుతున్నారు. కొత్తయిండ్లు అతివేగంగా వస్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకటేష్, శంకరను స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

గుడుపల్లె: విద్యార్థులు క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతాయని పీఈఎస్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ అభిరామి తెలిపారు. పీఈఎస్ నర్సింగ్ కళాశాల వార్షిక క్రీడోత్సవాలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలతో నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయన్నారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డేనియల్ విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కన్ను

- పట్టణ ఆవాసాల్లో డ్రోన్లతో నిఘా
- బహిరంగ మద్యం సేవనం, పేకాట, గంజాయి టార్గెట్
- డ్రోన్లను చూడగానే పరుగులు పెడుతున్న వైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం ఏరులై పారుతోంది. కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కర్ణాటకకు అతి సమీపంలో వున్న పలమనేరు నియోజకవర్గంలో అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా పేకాట, గోలీలాటలు పందేళ్లతోపాటు గంజాయి సేవించేవారు ఎక్కువగా వుంటున్నారు. వీరి ఆగడాలకు చెక్ పెట్టేందుకు స్థానిక పోలీసులు డ్రోన్లతో చేపట్టిన తనిఖీలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. మందుబాబులు డ్రోన్లను చూసి పరుగులు పెడుతున్నారు.

పలమనేరు: పట్టణ సమీపంలోని రొంటకుంట్ల రోడ్డు, మదనపల్లి రోడ్డు, ఎద్దులచెరువు కట్టకింద పట్టు పరిశ్రమశాఖ ఆఫీసు, గాంధీనగర్ ఆవాసాలు, గంటావూరు కాలనీ పక్కన అటవీప్రాంతం, డంపింగ్ యార్డు, టీఎస్ అగ్రహారం రోడ్డులోని ఘోరీతోపు, టి.వడ్డూరు వద్దనున్న ఎక్స్‌ప్రెస్ హైవే, గడ్డూరు కాలనీ నుంచి సముద్రపల్లికి వెళ్లే మట్టి రోడ్డు, రాధాబంగ్లా వెనుకనున్న లేఅవుట్లు, బొమ్మిదొడ్డి, నీళ్లకుంట అంగన్‌వాడీ పక్కనున్న రాగిమాను, చెరువు వెనుక వైపు మార్గం, బైపాస్ రోడ్డులోని వేమన విగ్రహం వెనుక వైపు, కౌండిన్య నది చుట్టుపక్కల, గంగవరం ఫ్లైఓవర్ నుంచి చేలల్లోని వైన్‌షాపు చుట్టుపక్కల, కీలపట్ల రోడ్డు, ఆంజనేయస్వామి ఆలయం వెనుకవైపు, పట్టణంలోని ఆర్టీసీ డిపో పక్కన ఎక్కువగా అసాంఘిక కార్యక్రమాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో పోలీసులు వాటికి చెక్ పెట్టడానికి పలు చర్యలు తీసుకున్నారు. ఫలితం లేకపోవడంతో చివరకు డ్రోన్లతో నిఘా పెట్టారు. తద్వారా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని అదుపులోకి తీసుకుని జైలుకు పంపుతున్నారు. దీంతో మందుబాబులతోపాటు ఇతర కార్యకలాపాలకు పాల్పడుతున్న వారు బెంబేలెత్తుతున్నారు.

బైపాస్‌లో బైక్ రైడర్లపైనా నిఘా

ఇటీవల జాతీయ రహదారిలో బైక్ రైడర్ల విన్యాసాలు ఎక్కువయ్యాయి. బైక్ రైడర్ల విన్యాసాల వల్ల ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఒంటి చక్రంపై బండిని నడపడం, నాగమంగళం నుంచి బైపాస్ మీదుగా గంటావూరు ఫ్లైఓవర్ దాకా బైక్ రేసింగ్‌లు సాగుతున్నాయి. ఈ క్రమంలో పోలీసులు ఈ ప్రాంతంలో డ్రోన్లతో నిఘా పెట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు. ఈ విషయమై పట్టణ సీఐ నరసింహరాజు మాట్లాడుతూ ఇప్పటికే గంగవరం పోలీసులు డ్రోన్ల ద్వారా పలు ప్రాంతాల్లో నిఘా పెట్టారని తెలిపారు. తాము కూడా పలమనేరు పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తున్నట్టు తెలిపారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు సమాచారం ఇస్తే ఆ ప్రాంతానికి సైతం డ్రోన్లను పంపి వారి ఆటకట్టిస్తామన్నారు.



డ్రోన్ కెమెరాలతో నిఘా పెడుతున్న పోలీసులు